క్లుప్తంగా

జెడ్పీ చైర్మన్ ప్రత్యేక పూజలు



సంపత్ వినాయకస్వామి ఆలయంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు

విజయనగరం: జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు నగరంలోని పైడితల్లి, సంపత్ వినాయక ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. భార్య పుష్పాంజలి, కుమార్తె సిరి సహస్ర, కుమారుడు సాయిమోహిత్, బద్దుకొండ ప్రదీప్‌బాబుతో కలిసి ముందుగా పైడితల్లి ఆలయానికి చేరుకున్న మజ్జి శ్రీనివాసరావు పూజలు చేయడంతో పాటు కుమార్తె సిరిసహస్ర, ప్రదీప్‌బాబు వివాహ శుభలేఖను అమ్మవారికి అందజేశారు. అనంతరం సంపత్ వినాయక ఆలయంలో పూజలు నిర్వహించగా.. ఆలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర



భోగాపురంలో ఎల్లమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

భోగాపురం: మండలం కేంద్రంలో ఎల్లమ్మతల్లి జాతర ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు కుటుంబసమేతంగా తరలివచ్చి ఎల్లమ్మతల్లిని దర్శించుకున్నారు. ఎల్లమ్మతల్లి పుట్టమట్టిని శరీరానికి రాసుకుంటే చర్మవ్యాధులు దరి చేరవని భక్తుల నమ్మకం. దీంతో భక్తులు వేకువజామునే తలస్నానం చేసి మడితో ఇంటింటికీ వెళ్లి జోగి దండి, అనంతరం ఆ జోగిని ఎల్లమ్మతల్లికి సమర్పించారు. జాతరకు తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు కొమ్మూరు బుల్లయ్య, ఆళ్ల విశ్వేశ్వరరావు ఏర్పాట్లు చేశారు.

నిరుపేదలను ఆదుకోవడంలోనే సంతృప్తి

విజయనగరం టౌన్: నిరుపేదలను ఆదుకోవడంలోనే సంతృప్తి ఉందని సుధారాణి మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎంపీ గౌరీశ్వరరావు అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ దివ్యాంగుల బాలికల వసతి గృహంలో బధిర విద్యార్థులకు భోజనం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ ట్రస్ట్ కోశాధికారి శిరీష జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి ఉపేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరానికి స్పందన



రోగులను తనిఖీ చేస్తున్న వైద్య సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లిలో ప్రముఖ రేడియో ఆర్టిస్ట్ మజ్జి ఆదినారాయణ స్మారకార్థం ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి స్పందన లభించింది. అనిల్ నీరుకొండ వైద్య సిబ్బంది సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 456 మందికి పరీక్షలు నిర్వహించారు. పలువురిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నడిపేన ఆనంద్, విభీషణరావు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రాల గీతాలను ఆలపిస్తున్న గాయకులు

విజయనగరం టౌన్: దొరకునా ఇటువంటి సేవ... అంటూ వర్ధమాన గాయనీ గాయకులు ఆలపించిన ఆపాత మధురాలు ఆహూతులను మైమరిపించాయి. స్థానిక గురజాడ కళాభారతి ఆడిటోరియం ఆవరణలో ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సినీసంగీత విభావరి నిర్వహించారు. కె.విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రాల గీతాలతో పాటు వాణీజయరాం పాడిన పాటలను గాయకులు ఆలపించారు. కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు, అధ్యక్షుడు గ్రంధి విష్ణుమూర్తి, కార్యదర్శి దవళ సర్వేశ్వరరావు, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తా

వంగర: షూటింగ్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర షూటింగ్‌బాల్ అసోసియేషన్ వైస్ చైర్మన్ పాలవలస శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని మద్దువలస దగ్గర విలేకరులతో మాట్లాడిన ఆయన క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు.



ఆలయ సమీపంలో విద్యుత్ ధగధగలు

ఎల్లమ్మ జాతరకు సర్వం సిద్ధం

- నేడు తొలేళ్ల సంబరం
- మంగళవారం సిరిమానోత్సవం
- విద్యుత్ కాంతులతో మెరుస్తున్న ఆలయం



ఎల్లమాంబ అమ్మవారు పుట్ట

విజయనగరం టౌన్: సిరుల తల్లి ఎల్లమాంబ జాతరకు సర్వం సిద్ధమైంది. అడుగడుగునా జనానీరాజనం అందుకునేందుకు తల్లి ముస్తాబవుతోంది. సోమవారం తొలేళ్ల ఉత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఇప్పటికే ఏర్పాట్లను పూర్తిచేసింది. విద్యుత్ అలంకరణలతో ఆలయం శోభాయమానంగా విరాజిల్లుతోంది. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 4 గంటల నుంచే అమ్మవారి పుట్ట వద్ద పూజలు ప్రారంభమవుతాయని కమిటీ సభ్యులు చెబుతున్నారు. మంగళవారం నిర్వహించే సిరిమానోత్సవానికి వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. రెండు రోజుల పాటు ఆలయం ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు, డెకరేషన్లు పూర్తయ్యాయి. భక్తులకు ఎండ తగలకుండా ఉండేందుకు బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు టెంట్లు వేశారు. క్యూలైన్లలో ఉండే భక్తులకు మంచినీరు, మజ్జిగ, చిన్నారులకు పాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం రాత్రి ఆలయం వద్ద ఎల్లమ్మ జీవిత చరిత్రను హరికథ రూపంలో వివరించారు. అలాగే భజనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, సోమ, మంగళవారాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.



విద్యుత్ కాంతులతో అలరారుతున్న ఆలయం

పూర్వజన్మ సుకృతం



అమ్మవారి సేవలో తరించడం నా పూర్వజన్మ సుకృతం. అందరి సమష్టి కృషితో ఎల్లమ్మ జాతర ఈ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులందరూ అమ్మవారిని దర్శించి మొక్కుబడులు చెల్లించుకోవాలి.

– చందక అప్పారావు, ఆలయ అర్చకుడు

ఎమ్మెల్సీ సురేష్‌బాబు ప్రచారం

నెల్లిమర్ల: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ మద్దతుదారు సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు (సురేష్‌బాబు) ఆదివారం ప్రచారం నిర్వహించారు. విశాఖపట్నంలోని సీతమ్మధార ప్రాంతంలో పట్టభద్రులైన ఓటర్లను కలిసి, మార్చి 13న జరిగే ఎన్నికల్లో సుధాకర్‌కు ప్రథమ ప్రాధాన్యతా ఓటు వేసి, గెలిపించాలని కోరారు. తద్వారా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వాన్ని, సంక్షేమ ప్రభుత్వాన్ని బలపరచాలన్నారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఈడీసీఏపీ చైర్మన్ కేకే రాజు, స్థానిక వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్సీ సురేష్‌బాబుతో పాటు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ను ఘనంగా సత్కరించారు.



సురేష్‌బాబు, సుధాకర్‌లను సత్కరిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

ధ్యానంతో రుగ్మతలు దూరం

- పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రామారావు

నెల్లిమర్ల: ధ్యానంతో శారీరక, మానసిక రుగ్మతలు దూరమవుతాయని పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు జె. రామారావు అన్నారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మంటపంలో ఆదివారం నిర్వహించిన ఆత్మ జ్ఞాన, ధ్యాన యజ్ఞం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ధ్యానంతో మానసిక ప్రశాంతత చేకూరడమే గాకుండా సర్వరోగాలు దూరమవుతాయన్నారు. నిజమైన జ్ఞానం ధ్యాన సాధనతోనే సాధ్యపడుతుందని చెప్పారు. అనంతరం ధ్యానం చేసే విధానాన్ని సీనియర్ పిరమిడ్ మాస్టర్లు మొయిద ప్రకాశరావు, డీవీ కృష్ణారెడ్డి సాధకులకు వివరించారు. పిరమిడ్ మాస్టర్లు రామకృష్ణ రాజు, ఓంప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.



ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తున్న రామారావు

పుస్తక పఠనంపై దృష్టి సారించాలి

తెర్లాం: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనంపై దృష్టి సారించాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన చదవడం మాకిష్టం అనే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం చేపట్టి, చిన్నారులు, విద్యార్థులతో పుస్తకాలు, కథలు చదివించడం, రాయించడం వంటివి చేయిస్తూ వారికి చదువుపై మక్కువ పెంచుతోందని తెలిపారు.

మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

విజయనగరం: నగరంలో పచ్చదనాన్ని పెంపొందించడంపై కార్పొరేషన్ యంత్రాంగా ప్రత్యేక దృష్టి సారించింది. కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు ఆదేశాల మేరకు నగరంలోని డివైడర్లలో నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు చేపడుతున్నారు. వేసవి ఆరంభంలో ఎండలు మండుతుండడంతో నీరు అందక మొక్కలు చనిపోయే ఆస్కారం ఉండడంతో.. ప్రతిరోజు మొక్కలకు నీరు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. 50 డివిజన్లుగా విస్తరించిన విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 23 ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై డివైడర్లు ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. సాధారణ రోజుల్లో మూడు రోజులకోసారి మొక్కలకు నీరు పెట్టగా... ప్రస్తుత వేసవికాలం దృష్ట్యా ప్రతిరోజు ఉదయం మొక్కలకు నీరు పోసి రక్షించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా కేటాయించిన వాటర్ ట్యాంకు ఏర్పాటు చేశారు. మొక్కల సంరక్షణకు ప్రజలు కూడా సహకరించాలని కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు కోరారు.



ట్యాంకర్ ద్వారా మొక్కలకు నీరు సరఫరా చేస్తున్న దృశ్యం

● మంచు దుప్పటి..



ఒకవైపు ఎండలు మండిపోతుండగా మరోవైపు మంచు విపరీతంగా కురుస్తోంది. ఆదివారం ఉదయం 8 గంటల వరకు మండల కేంద్రంతో పాటు పినతాడివాడ, తదితర గ్రామాల్లో విపరీతమైన మంచు కురిసింది. దీంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందిపడ్డారు. అలాగే పది గంటల నుంచి మధ్యాహ్నం మూడు వరకు ఎండ కూడా అదే స్థాయిలో తారెత్తించింది. - డెంకాడ

ప్రణాళికాబద్ధంగా ప్రిపరేషన్

విజయనగరం అర్బన్: పోటీ పరీక్షలల్లో విజయం సాధించడానికి అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని ప్రతిభ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జంపాన సుధాకర్ అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాయలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు మెలకువలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసరావు, రాంబాబు, పిన్నింటి బాలకృష్ణ, కట్టమూరి చంద్రశేఖర్, నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర



మూలవిరాట్ విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

కొత్తవలస: మండలంలోని కుమ్మరిబంజరి సమీపంలోని గరుడాద్రి కొండపై నిర్మించిన లక్ష్మీ దేవి,గోదా దేవి అమ్మవార్ల సమేత కల్యాణ వేంక టేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో ప్రతిష్ఠించనున్న దేవతా మూర్తుల విగ్రహాల శోభా యాత్రను తొలిరోజు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి బోని వెంకటప్పారావు ఆధ్వర్యంలో వేదపండితులు అమ్మవార్లు, స్వామివార్ల విగ్రహాలకు పూజలు చేసి ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. అనంతరం ఆలయ సమీపంలో నిర్మించిన పర్ణశాలలో విగ్రహాలను భద్రపరిచారు. సోమవారం నుంచి బుధవారం వరకు విశేష పూజలు, హోమాలు నిర్వహించి, విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు.

రూ.1.27 కోట్లతో ఇంటింట కుళాయిలు



రామస్వామిపేటలో చేపడుతున్న పైపులైన్ ఏర్పాటు పనులు

వేపాడ: మండలంలోని పలు గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.1.27 కోట్లతో ఇంటింట కుళాయిల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వి.దేవి ఆదివారం తెలిపారు. పి.కె.ఆర్.పురం గ్రామానికి రూ.8.4 లక్షలు, చినగుడిపాల పంచాయతీ బోజంకి వానిపాలెంకు రూ.10.70 లక్షలు, నల్లబిల్లి పంచాయతీ పరిధి చలుమూరివానిపాలెంకు రూ.9.6 లక్షలు, వారాది కొంపలు గ్రామానికి రూ. 9.6 లక్షలు, వావిలపాడు పంచాయతీ కడకొండకు రూ. 15.37లక్షలు, వేపాడ పంచాయతీ చిరతపాలెంకు రూ.5.4 లక్షలు, కొండగంగుబూడి పంచాయతీ ఎస్.కోట సీతారాంపురం గ్రామానికి రూ.17.25లక్షలు, రామస్వామిపేటకు రూ.15.33 లక్షలు, వీలుపర్తి పంచాయతీ రాయుడుపేటకు రూ.10.7లక్షలు, బానాదికి రూ.18.92 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఆయా గ్రామాల్లో బోర్ల తవ్వకాలు, పైపులైనులు, ట్యాప్‌లు ఏర్పాటు పనులు చేయిస్తున్నామని ఏఈ చెప్పారు. పనులు పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తొలగనున్నాయి. పనులు జోరుగా సాగుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంతంగా ప్రజ్ఞా వికాసం పరీక్ష

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మోడల్ ప్రజ్ఞా వికాసం పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జె.రవికుమార్ మాట్లాడుతూ, పరీక్షలంటే ఉన్న భయాన్ని పోగొట్టేందుకు పదో తరగతి విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఈ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మండల వ్యాప్తంగా సుమారు 500 మంది విద్యార్థులు పరీక్ష రాశారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: మోడల్ ప్రశ్న పత్రాలు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పరీక్షకు స్పందన

నెల్లిమర్ల: పదోతరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షకు స్పందన లభించింది. పట్టణంలోని ఆదిత్య విద్యాలయంలో ప్రిన్సిపాల్ వి.సూరిబాబు పర్యవేక్షణలో పరీక్ష జరిగింది. మండల వ్యాప్తంగా పది కేంద్రాల్లో 550 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు నిర్వాహకులు సంతోష్, ప్రసాద్ తెలిపారు.



నెల్లిమర్ల: పరీక్ష రాస్తున్న విద్యార్థులు



డెంకాడ: పెదతాడివాడ ఉన్నత పాఠశాలలో మోడల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

డెంకాడ: మండలంలోని పెదతాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకుడు నారాయణరావు మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థులకు పరీక్షలంటే ఉన్న భయాన్ని పోగొట్టేందుకే మోడల్ పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు. మండల స్థాయి విజేతలకు జిల్లాస్థాయిలో పరీక్ష నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకుడు తిరుపతిరావు పాల్గొన్నారు.

సమాజ హితమే పరమావధి

- జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్

విజయనగరం: సమాజ హితమే పరమావధిగా ఇంటర్నేషనల్ ఉయ్ లవ్ యు ఫౌండేషన్ కృషి చేస్తోందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా నాయకుడు జి. ఈశ్వర్‌కౌశిక్ అన్నారు. నగరంలోని రెవెన్యూ హోమ్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా సంస్థ ఆధ్వర్యంలో 534వ రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వేసవి కాలంలో రక్తం కొరత ఎక్కువగా ఉంటుందన్న విషయాన్ని గ్రహించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పార్టీ శ్రేణులను, రక్తనిధి కేంద్రాల ప్రతినిధులను సమన్వయపరచి రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా రక్తదాతలను ఆయన అభినందించారు. నిర్వాహకులు ఈశ్వర్ కౌశిక్‌ను సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాద్, కార్యదర్శి సత్యం, సంస్థ సీఈఓ బి.రామ్‌గోపాల్, జయశంకర్, రమేష్, డేవిడ్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



రక్తదాతలను అభినందిస్తున్న ఈశ్వర్‌కౌశిక్

వైభవంగా రాజరాజేశ్వరి ఆలయ వార్షికోత్సవం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని దేవుని నెలివాడ గ్రామంలో ఆదివారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. రాజరాజేశ్వరి ఆలయ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేద పండితులు ఆలయ ప్రాంగణంలో మహాచండీ హోమం చేపట్టారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, నేతలు అంబళ్ల శ్రీరాములనాయుడు, చనమళ్ల వెంకటరమణ, కేవీ సూర్యనారాయణరాజు, తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లెంక సత్యం పాల్గొన్నారు.



అమ్మవారి సన్నిధిలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

అలరించిన గాత్ర కచేరి

విజయనగరం టౌన్: ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ 65వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కొత్తపేటలో ఉన్న ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో ఆదివారం రాత్రి నిర్వహించిన బి.వైద్యనాథన్ (హైదరాబాద్) గాత్రకచేరీ ఆకట్టుకుంది. వయోలిన్‌పై నీలాద్రిరావు, మృదంగంపై చెన్నైకి చెందిన ప్రముఖ విద్వాంసుడు డాక్టర్ తిరువారూర్ భక్తవత్సలం సహకరించారు. మోర్సింగ్‌పై డాక్టర్ శ్రీనివాస గోపాలన్, జయంతి, జ్యోతి గాత్ర సహకారామందించారు. అనంతరం ప్రముఖులు చేతుల మీదుగా వైద్యనాథన్‌కు సంగీత కళామిత్ర బిరుదుతో సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు, కార్యదర్శి డాక్టర్ మండపాక రవి, డాక్టర్ నగేష్, తదితరులు పాల్గొన్నారు.



గాత్రకచేరీ నిర్వహిస్తున్న వైద్యనాథన్

ఓర్వలేకే విషపు రాతలు



ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు

- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూడలేకే ఎల్లో మీడియా ఈనాడు, ఆంధ్రజ్యోతి విషపు రాతలు రాస్తున్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం నాయకుడు కరుమజ్జి సాయికుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఐస్ ఫ్యాక్టర్ జంక్షన్ వద్ద ఈనాడు, ఆంధ్రజ్యోతి ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సాయికుమార్, తదితరులు మాట్లాడుతూ ఈనాడు, ఆంధ్రజ్యోతి పేపర్లు ప్రజల విశ్వసనీయత కోల్పోయాయన్నారు. ప్రభుత్వాన్ని అస్థిర పరచాలనే ఉద్దేశంతో ఈనాడు రామోజీరావు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ తప్పుడు కథనాలు వండి వారుస్తున్నారని మండిపడ్డారు. కుల పిచ్చితో ప్రభుత్వంపై బురద జల్లుతున్న రామోజీరావు, వ్యవస్థలను మేనేజ్ చేసే చంద్రబాబుల వ్యవహారశైలి పట్ల ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు గౌతమ్, ధీరు, గుణశేఖర్, తుమ్మగంటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పారాదిలో గ్రామదేవతల సంబరాలు

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామంలో కొత్తపోలమ్మ, పాతపోలమ్మ, నూకాలమ్మ గ్రామ దేవతల సంబరాలు సోమవారం నిర్వహించనున్నారు. తొమ్మిదేళ్లకోసారి జరిగే ఈ పండగను కోవిడ్ మహమ్మారి కారణంగా గత రెండేళ్లుగా చేయకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో 11 ఏళ్ల తర్వాత సంబరాలు కావడంతో అంగరంగ వైభవంగా చేసేందుకు గ్రామస్తులు సన్నాహాలు చేస్తున్నారు. పారాదిలో జరిగే అంజలి రథోత్సవం, సిరిమానోత్సవం, బళ్లవేషాల ప్రదర్శనలు చూసేందుకు పరిసర గ్రామాల నుంచి ప్రజలు పోటెత్తుతారు. మండలంలోని భోజరాజపురం, నారాయణప్పవలస, కాశిందొరవలస వంటి దాదాపు 13 గ్రామాల్లో కూడా గ్రామదేవతల సంబరాలు నిర్వహిస్తారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం సిరిమానోత్సవం, బుధవారం అనుపోత్సవం చేపడతారు. ఈ క్రమంలో ఆదివారం అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు చేశారు.